## రేపు చలో హైదరాబాద్

కందుకూరు,ఫిబ్రవరి 8 కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమైనట్లు మండల సీపీఎం, సీఐటీయూ కార్యదర్శి బుట్టి బాలరాజ్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 10వ తేదీన చలో హైదరాబాద్ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు మధ్యాహ్న భోజన కార్మికులు ఆశ వర్కర్లు, ఆటో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కనీసం ఉద్యోగ భద్రత కల్పించి నెలకు కనీసం రూ. 26 వేల వేతనాన్ని చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని 12 గంటల పని దినాన్ని రద్దు చేసి ఎనిమిది గంటల పని దినాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పార్లమెంట్ అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాలని కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మొండి వైఖరి విడ నాడాలని కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల్లో మార్పు రానట్లయితే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు కార్మికులు పాల్గొన్నారు

### కాంగ్రెస్ సర్కార్
## పాలనపై దృష్టి పెట్టాలి

కందుకూరు. ఫిబ్రవరి 8: రాష్ట్ర ప్రభుత్వం డ్రామాలు ఆపి పాలనపై దృష్టి పెట్టాలని రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం మాజీ కార్యదర్శి మల్లారెడ్డి తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యారని తెలిపారు. సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులను చెల్లించడం లేదని ఎంతోమంది ఆత్మహత్య చేసుకున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే కేసులు, అరెస్టులు చేస్తున్నారని తెలిపారు. గ్యారంటీల విషయంలో పట్టించుకోవడంలేదని అన్నారు. కాంగ్రెస్ అధికారంలో రావడానికి మోసపూరితమైన వాగ్దానాలు చేసిందన్నారు. అధికారంలోకి వచ్చిన అనంతరం పట్టించుకోవడంలేదని తెలిపారు. ప్రజా పాలన పేరిట రేషన్ కార్డులతో పాటు వివిధ ప్రభుత్వ పథకాలకు దరఖాస్తులు చేయించుకున్నారని తెలిపారు .తిరిగి మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించడం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులకు న్యాయం చేయాలని కోరారు. మళ్లీ దరఖాస్తులు చేసుకోవాలని సూచించడం పై ప్రజలు ప్రభుత్వంపై మండిపడుతున్నారని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నాయని చెప్పి తిరిగి ప్రజలను మోసం చేయాలని చూస్తుందని అన్నారు. ప్రభుత్వ వైఖరిలో మార్పు రానట్లయితే ప్రజలు ఛీ కొడుతారని హెచ్చరించారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతి

**ఉప్పల్,ఫిబ్రవరి 8:** గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందారు. ఈ సంఘటన ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఉప్పల్ మెట్రో స్టేషన్ సమీపంలో ఓ వ్యక్తి మృతి చెంది ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచా రం ఇవ్వగా వారు అక్కడి వెళ్లి చూడగా అతను మృతి చెంది ఉన్నాడు. అతడు బ్రౌన్ అండ్ బ్లాక్ కలర్ చెక్స్ షర్టు,బ్రౌన్ కలర్ పాయింట్ ధరించి ఉన్నాడు. మృతుడి ఒంటిపై ఎటువంటి గాయాలు లేవు. మృతదేహాన్ని గాంధీకి తరలించి, కేసు నమోదు చేసిపోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠకు ఎమ్మెల్సీ కవితకు ఆహ్వానం



ఎమ్మెల్సీ కవితకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, తెలంగాణ జాగృతి నాయకులు

హయత్‌నగర్, ఫిబ్రవరి 8: హయత్‌నగర్ మండల కార్యాలయం ఆవరణలో రేణుకా ఎల్లమ్మ దేవాలయం ప్రారంభోత్సవ కార్యక్రమానికి రావాలని తెలంగాణ జాగృతి నాయకుడు ఆవుల సురేందర్, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను శనివారం కలిసి ఆహ్వాన పత్రికను అందజేసినట్లు తెలిపారు. ఈ నెల 14 నుంచి 16 వరకు హయత్‌నగర్ రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి రాష్ట్ర నాయకులు సందీప్ కుమార్, రాము యాదవ్, ఆలయ కమిటీ చైర్మన్ ఎర్ర రవీందర్, గౌరవ అధ్యక్షుడు పారంద స్వామి, ఉపాధ్యక్షులు ముత్యం శ్రీకాంత్, కోశాధికారి పిట్టల జంగం, ఉప కోశాధికారి క్యాదాస్ సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

## చైన్ స్నాచర్ అరెస్ట్

బడంగ్ పేట, ఫిబ్రవరి 8 : ఓ మహిళ మెడలో నుంచి పుస్తెలతాడు లాక్కెళ్లిన సంఘటన మీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ నాగరాజు కథనం ప్రకారం.. బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీ నిలయ కాలనీలో నివాసం ఉండే ప్రవీణ్ కుమార్ ఈ నెల మూడో తేదీన మీర్ పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని టీఎస్ ఆర్‌నగర్ లో బట్టల షాపులో మహిళ ఉండగా ప్రవీణ్ పల్సర్ బైక్ పై వచ్చి మహిళ ముఖంపై రసాయనం చల్లాడు. దీంతో మహిళ అరవడంతో తప్పించుకొని పారిపోయాడు. సీసీ ఫుటేజీ ఆధారంగా ప్రవీణ్‌ను పట్టుకొని అరెస్టు చేశామని సీఐ తెలిపారు. అతడి వద్ద నుంచి 20 గ్రాముల బంగారు ఆభరణాలు, ఒక పల్సర్ బైక్ ను స్వాధీనం చేసుకొని రిమాండ్ కు తరలించినట్లు సీఐ నాగరాజు తెలిపారు.

## ఆర్టీసీ కార్మికులు సమ్మెకు సిద్ధమవ్వాలి



హయత్‌నగర్ బస్టాండ్‌లో మాట్లాడుతున్న జేఏసీ నాయకుడు యాదయ్య

హయత్‌నగర్, ఫిబ్రవరి 8 : ఆర్టీసీ కార్మికులు జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన సమ్మెకు సిద్ధం కావాలని జేఏసీ నేత కత్తుల యాదయ్య పిలుపునిచ్చారు. శనివారం హయత్‌నగర్ బస్టాండ్‌లో వన్ ఛేంజ్ ఓవర్ దగ్గర జేఏసీ ఆధ్వర్యంలో గేట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలన్నారు. ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆర్టీసీకి ఇవ్వాలని కోరారు. 2021 పేస్కేలును వెంటనే చేయాలని, 2017 పేస్కేల్ ఏరియర్స్ బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు సెటిల్‌మెంట్ వెంటనే చెల్లించాలని, ప్రజలకు మెరుగైన ప్రయాణం సౌకర్యం కల్పించాలన్నారు. కార్మికులపై పనిభారం తగ్గించాలని, సీసీఎస్ ఆర్పీఎస్, పీఎఫ్ డబ్బులు వెంటనే చెల్లించాలని కోరారు. ఆర్టీసీ ఉద్యోగులందరూ జేఏసీ పిలుపు మేరకు ఎప్పుడు పిలుపు ఇచ్చిన సమ్మెకు సిద్ధమవ్వాలని, కార్మికులకు పనిగంటలు పెరిగి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఆర్టీసీని ప్రైవేటుపరం చేసేందుకు ప్రభుత్వం కుట్రలు పన్నుతుందని, దీన్ని పూర్తిగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. జేఏసీ సభ్యులు రాములు, హయత్‌నగర్ డిపో-1 జేఏసీ నాయకులు అమనగంటి వెంకన్న, వెంకట్, దశరథ, ప్రసాద్, చారి, ప్రకాశ్ పాల్గొన్నారు.

### 17 నుంచి ప్రత్యంగిరా దేవి
## బ్రహ్మోత్సవాలు

ఆర్కేపురం, ఫిబ్రవరి 8: పీఠాధిపతులు జగద్గురువులు శ్రీశ్రీశ్రీ సిద్ధేశ్వరానందభారతి మహాస్వామి ఆశీస్సులతో ఆర్కేపురం డివిజన్‌లోని కుర్తాళ పీఠం శ్రీ ప్రత్యంగిరా దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 17 నుంచి 19వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ సెక్రటరీ మునిపల్లె శ్రీనివాస్ తెలిపారు. శనివారం ఆలయ ఆవరణలో బ్రహ్మోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు అమ్మవారికి ఉదయం 6.30 గంటలకు విశేష 18 ద్రవ్యాలతో అభిషేకం, 10 గంటలకు మహిళలతో కుంకుమార్చన, సాయంత్రం 6గంటలకు అమ్మవారికి విశేష అలంకరణ, రాత్రి 8గంటలకు మహా నక్షత్ర హారతులు జరుగుతాయని తెలిపారు. 3వ రోజు ఫిబ్రవరి 19న ఉదయం అమ్మవారికి అన్నాభిషేకం, సాయంత్రం పల్లకీ సేవ ఉంటుందని తెలిపారు. భక్తులందరూ పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మునిపల్లె సువర్ణలత, విఠల్‌శర్మ, అన్నపూర్ణ, జయప్రద కామేశ్వరి, ఉష, నీలిమ, హేమ, శకుంతల, సరిత, హరిత తదితరులు పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాల కరపత్రాలను
ఆవిష్కరిస్తున్న మునిపల్లె శ్రీనివాస్, తదితరులు

## అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



కాలనీల్లో అభివృద్ధి పనులను పరిశీలించి
అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అబ్దుల్లా బలాల

మలక్ పేట, ఫిబ్రవరి 8: పాత మలక్‌పేట డివిజన్ లోని పలు కాలనీల్లో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనులను శనివారం మలక్ పేట ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. హౌసింగ్ బోర్డ్ కాలనీలో కొనసాగుతున్న బాక్స్ డ్రైన్ నిర్మాణ పనులను, అగ్రికల్చర్ ఆఫీస్ వద్ద కొనసాగుతున్న వీడీసీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు కాంట్రాక్టర్లకు ఆయన పలు సూచనలు చేశారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతకు అధిక ప్రాధాన్యతను ఇవ్వాలని అన్నారు. షెడ్యూల్ ప్రకారం అన్ని పనులు సకాలంలో పూర్తయ్యేలా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పాత మలక్ పేట డివిజన్ లో కోట్లాది రూపాయలతో రోడ్లు, డ్రైనేజీ, బాక్స్ డ్రైన్, తాగునీటి వసతి, పార్కులు, ప్లే గ్రౌండ్ల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. కాలనీ వాసులకు మెరుగైన సదుపాయాల కల్పనే ధ్యేయంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని ఆయన తెలిపారు. బాక్స్ డ్రైన్లతో కాలనీలో ముంపు సమస్య తీరనుందని పేర్కొన్నారు. రోడ్ల నిర్మాణాల్లో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నామని, బీటీ రోడ్ల కన్నా సీసీ రోడ్ల నిర్మాణానికే అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఆయన తెలిపారు. డివిజన్ ఎంఐఎం అధ్యక్షుడు షఫీ, వివిధ విభాగాల అధికారులు, వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, కాలనీవాసులు పాల్గొన్నారు.

## వీరన్నగుట్ట శివాలయంలో శివరాత్రి ఏర్పాట్లు



మహా శివరాత్రి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్, ఫిబ్రవరి 8: మహాశివరాత్రి సందర్భంగా వీరన్నగుట్టలోని శివాలయాన్ని సందర్శించే భక్తులకు ప్రత్యేకమైన వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి తెలిపారు. మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ పరిధి వీరన్నగుట్టలోని శివాలయాన్ని శనివారం ఆయన సందర్శించి మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా వచ్చే భక్తుల ఏర్పాట్లపై ఆలయ కమిటీ సభ్యులతో చర్చించారు. ఈ సందర్భంగా కొప్పుల నర్సింహారెడ్డి మాట్లాడుతూ మహా శివరాత్రి పర్వదినం రోజున వీరన్నగుట్టలోని శివాలయాన్ని దర్శించుకునేందుకు సుమారు 10 వేల మంది భక్తులు హాజరవుతారని అంచనా వేస్తున్నామన్నారు. ఆలయానికి వచ్చే భక్తుల కోసం బారికేడ్లు ఏర్పాటు చేయడం, రంగు రంగుల దీపాల అలంకరణ, ఆలయ సుందరీకరణ తదితర ఏర్పాట్లు చేయాల్సి ఉందన్నారు. అధికారులను సమన్వయం చేసుకుంటూ మహా శివరాత్రికి ఆలయాన్ని ముస్తాబు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పలు కాలనీల సంక్షేమ సంఘం సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

## శ్మశానవాటిక సమస్య పరిష్కారానికి కృషి



జోనల్ కమిషనర్ హేమంత కేశవ్‌పాటిల్‌కు
సమస్యలు వివరిస్తున్న రాక్‌టౌన్‌కాలనీ అధ్యక్షుడు వినోద్‌రెడ్డి

మన్సూరాబాద్, ఫిబ్రవరి 7: నాగోల్ డివిజన్ పరిధి రాక్‌టౌన్‌కాలనీలో నెలకొన్న పార్కుల సమస్య, శ్మశానవాటికలను ఇతర ప్రాంతాలకు తరలించే విషయంపై ఇటీవల కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి, జోనల్ కమిషనర్ హేమంత కేశవ్‌పాటిల్‌కు ఫిర్యాదు చేశారు. శనివారం జోనల్ కమిషనర్ హేమంత కేశవ్‌పాటిల్, కార్పొరేటర్ చింతల అరుణతో కలిసి రాక్‌టౌన్‌కాలనీలో పర్యటించారు. రాక్‌టౌన్‌కాలనీలోని పార్కులను పరిరక్షించేందుకు జీహెచ్‌ఎంసీ చర్యలు తీసుకోవాలని.. అంతేకాకుండా పార్కులను అభివృద్ధి చేసి ప్రజల అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్ది ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలని కాలనీవాసులు, జోనల్ కమిషనర్‌ను కోరారు. రాక్‌టౌన్ కాలనీలో సుమారు 4 వేల జనాభా నివసిస్తున్నారని.. ఈ ప్రాంతంలో ఉన్న శ్మశానవాటికలతో ఇబ్బందులు గురవుతున్నాయని తెలిపారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చి కాలనీలో అంత్యక్రియలను నిర్వహించడం వలన కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారన్నారు. కాలనీలో నెలకొన్న ప్రధానమైన రెండు సమస్యలను పరిష్కరించేందుకు సహకరిస్తామని జోనల్ కమిషనర్ హేమంత కేశవ్‌పాటిల్, కార్పొరేటర్ చింతల అరుణ హామీ ఇచ్చినట్లు కాలనీ అధ్యక్షుడు ఎర్ర వినోద్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ సిటీ ప్లానర్ శ్రీనివాస్‌యాదవ్, డీసీ తిప్పర్తి యాదయ్య, డీఈ కనకయ్య, ఏఈ దీపక్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, టీపీఎస్ అక్బర్, కాలనీ అధ్యక్షుడు వినోద్‌రెడ్డి, కార్యదర్శి నాగవెల్లి జైపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు మణిపాల్‌రెడ్డి, సూర్యనారాయణ, నాగరాజు, కాలనీ మాజీ అధ్యక్షులు రాంరెడ్డి, మాధవరెడ్డి పాల్గొన్నారు.

## అలరించిన కూచిపూడి ప్రదర్శన



నృత్య ప్రదర్శనలో కళాకారులు

ఉప్పల్ ఫిబ్రవరి 8: ఉప్పల్ శిల్పారామంలో శనివారం అభినయ కూచిపూడి కళాక్షేత్రం గురువు పావని శ్రీలత ప్రసాద్ శిష్య బృందం చే కూచిపూడి నాట్య ప్రదర్శన ఆద్యంతం అలరించింది. రంగపూజ, శ్రీ గణపతిమ్, విన్నపాలు, నమశ్శివా య, జతిస్వరం, ఇదిగో భద్రాద్రి , దశావతర శబ్దం, మొదలైన అంశాలను ప్రదర్శించారు. శ్రీదేవి, అలేఖ్య రెడ్డి, జెస్సికా, కైవల్య, సుదీక్ష, నమ్రత, మహతి,నక్షత్ర, స్నిగ్ధ, సాయి కృతిక, హంసిని, అనేక, హోషిక, జోషిక, షాలిని, నిశిత తమ ప్రదర్శనతో మెప్పించారు.

## పార్కుల అభివృద్ధికి చర్యలు

మల్లాపూర్, ఫిబ్రవరి 8: మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని పార్కులలో అన్ని వసతులు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కార్పొరేటర్ ప్రభుదాస్ అన్నా రు. శనివారం ఆయన డివిజన్ పరిధిలోని రాజీవ్ పార్క్‌ను జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఏఈ లింగారావు, వర్క్‌ఇన్‌స్పెక్టర్ చారి, నాయకులు చారి, రామకృష్ణ, బాలనర్సింహ పాల్గొన్నారు.


## రాజకీయ అజ్ఞాని మధుయాష్కి



మాట్లాడుతున్న బీఆర్ఎస్ వనస్థలిపురం
డివిజన్ అధ్యక్షుడు రవికుమార్

వనస్థలిపురం, ఫిబ్రవరి 8 : నిజామాబాద్‌లో ముఖం చెల్లక ఎల్బీనగర్‌కు వచ్చిన మధుయాష్కి దివాళాకోరు రాజకీయాలు చేస్తున్నాడని బీఆర్ఎస్ వనస్థలిపురం డివిజన్ అధ్యక్షుడు చింతల రవికుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ డివిజన్ ఉపాధ్యక్షుడు ఆనంద్‌రాజ్‌తో కలిసి శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజానాయకుడైన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిపై ఇష్టమొచ్చినట్లుగా అవాకులు చెవాకులు పేలుతున్నాడన్నారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఎలాంటి అవినీతి మరకలేని నాయకుడు అని అన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్నా ఎల్బీనగర్‌లో ఉనికిని కోల్పోతున్న కాంగ్రెస్ పార్టీని కాపాడుకోలేని అసమర్థ నాయకుడు మధుయాష్కి అన్నారు. నియోజకవర్గానికి టూరిస్టులాగా వచ్చివెళ్లే వ్యక్తికి అభివృద్ధి గురించి ఎలా తెలుస్తుందని ఎద్దేవా చేశారు. దమ్ముంటే ఎల్బీనగర్ చౌరస్తాలో చర్చకు రావాలని సవాల్ విసిరారు. నియోజకవర్గంలో ఎన్నికలకు ముందు ఇద్దరు కార్పొరేటర్లను కొనుక్కున్నారని, వారు ప్రజలకు సేవ చేస్తున్నారా, అభివృద్ధి చేస్తున్నారా, అవినీతి చేస్తున్నారా తెలుసుకోవాలని హితవు పలికారు. ఎల్బీనగర్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేసిన ఘనత సుధీర్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వేల కోట్ల నిధులు తీసుకువచ్చి శరవేగంగా అభివృద్ధి చేశామని, నియోజకవర్గంలో ఎక్కడికి వెళ్లిన కనిపిస్తుందన్నారు. కనీస పరిజ్ఞానం లేని మధు యాష్కి ముందుగా నియోజకవర్గంపై అవగాహన పెంచుకోవాలన్నారు.

## ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేస్తాం



గౌరవ వేతనం అందజేస్తున్న కార్పొరేటర్ శాంతి సాయిజన్‌శేఖర్

**ఉప్పల్, ఫిబ్రవరి 8 :** ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేస్తూ పేద, మధ్యతరగతి విద్యార్థులకు తగిన ప్రోత్సాహం అందిస్తున్నామని నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ అన్నారు. నాచారంలోని వెస్లీ కో ఎడ్యుకేషన్ హై స్కూల్ గవర్నమెంట్ ఎయిడెడ్ పాఠశాలలో అధ్యాపకుల కొరత కారణంగా గత సంవత్సర కాలం నుంచి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఓ ప్రైవేటు ఉపాధ్యాయురాలిని నియమించి ప్రతినెల ఆమెకు గౌరవ వేతనం ఇస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం ఆమె గౌరవ వేతనాన్ని కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ అందశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి, కోటేశ్వరరావు, భాష, బీఆర్ఎస్ నాయకులు సాయి జన్ శేకర్, కట్టబుచ్చన్న గౌడ్, పాల్గొన్నారు.

## పార్కు స్థలం ఆక్రమణపై రగడ


బడంగ్‌పేట, ఫిబ్రవరి8: మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జిల్లెలగూడ శక్తి నగర్‌లో ఉన్న పార్కు స్థలాన్ని కొంత మంది ఆక్రమణ చేయడానికి వచ్చినట్లు కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి తెలిపారు. 1978 నుంచి కాలనీ పార్కుగా ఉన్న స్థలాన్ని కాజేయడానికి కొంత మంది పూనుకున్నారన్నారు. మున్సిపల్ అధికారులు పార్కు స్థలం నిర్ధారణ చేసి బోర్డు పెట్టడం జరిగిందన్నారు. శనివారం మధ్యాహ్న ఒంటి గంట సమయంలో కొంత మంది జేసీబీ తీసుకొని స్థలంలో పనిచేస్తుండగా కాలనీ వాసులందరం అడ్డుకోవడం జరిగిందన్నారు. అడ్డుకున్న కాలనీ వాసులను చితక బాదినట్లు తెలిపారు. జరిగిన సంఘటనపై మీర్‌పేట పోలీసులకు తెలియజేశామన్నారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. అక్రమంగా బిగించిన సీసీ కెమెరాలను కాలనీ వాసులు పరిశీలిస్తుండగా తిరిగి వచ్చి దౌర్జన్యం చేశారన్నారు. సెల్‌ఫోన్లు సైతం లాకున్నారన్నారు. అసలు వచ్చిన వారు ఎవరన్నది నోరు విప్పడానికి కాలనీ వాసులు భయం గుప్పిట్లో ఉన్నారు. కోట్లు విలువ చేసే పార్కు స్థలం 40 సంవత్సరాల నుంచి కాపాడుతున్నామని కాలనీ వాసులు పేర్కొంటున్నారు. సంబంధంలేని వ్యక్తులు వచ్చి దాడులు చేస్తున్నారన్నారు. వారి నుంచి రక్షణ కల్పించాలని కాలనీ వాసులు మీర్‌పేట పోలీస్ స్టేషన్‌లో శక్తి నగర్ కాలనీ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, ఉపాధ్యక్షులు సత్యానారాయణ, రవీందర్, జ్ఞానేశ్వర్, కిశోర్, సురేశ్ ఫిర్యాదు చేశారు.



### ఫంక్షన్‌హాల్ పై చర్యలు
## తీసుకోవాలని వినతి

బడంగ్‌పేట, ఫిబ్రవరి 8 : బడంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడ రామిడి సత్యనారాయణ రెడ్డి కాలనీలో అక్రమంగా నిర్మించిన ఫంక్షన్ హాల్ పై చర్యలు తీసుకోవాలని కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రాంరెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, రవీందర్ రెడ్డి, కృష్ణ నాయక్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి శనివారం వినతి పత్రం అందజేశారు. కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు కాలనీవాసులు ఇచ్చిన సమస్యను పరిశీలించాలని ఎమ్మెల్యే కమిషనర్ కు ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు కమిషనర్ ఫంక్షన్ హాల్ యజమానులకు నోటీసులు జారీ చేశారు. ఏడు రోజులలో వివరణ ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నారు. ఏడు రోజులు గడిచిన ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి పార్కింగ్ లేకుండా ఫంక్షన్ హాల్ నిర్మాణానికి సైతం అనుమతి లేకుండా అక్రమ నిర్మాణం చేపడితే చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు. ఇండ్ల మధ్యన ఫంక్షన్ హాల్ ఉండటం వలన శబ్ద కాలుష్యం ఏర్పడుతుందని కాలనీ వాసులు ఫిర్యాదులో పేర్కొన్నారు. పార్కింగ్ లేకపోవడం వలన ఇండ్ల ముందే పార్కింగ్ చేసే అవకాశాలు ఉన్నాయని కాలనీవాసులు వాపోతున్నారు. కాలనీకి విద్యుత్ అంతరాయం ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. ఫంక్షన్ హాల్ లో వ్యర్థాలు బయటపడేసే అవకాశం, ఉందన్నారు. డ్రైనేజీ, నీటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. మున్సిపల్ అధికారులు ఎలాంటి అనుమతి లేని ఫంక్షన్ హాల్ యజమానులపై చర్యలు తీసుకోవాలన్నారు. చర్యలు తీసుకోవడానికి అధికారులు ఎందుకు జాప్యం చేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు.

## టీవీఎస్‌పై కుంభమేళాకు వృద్ధుడు



జెండా ఊపి యాత్రను ప్రారంభిస్తున్న సర్వబాబు యాదవ్

**రామంతాపూర్,ఫిబ్రవరి 8:** రామంతాపూర్ సత్యనగర్‌కు చెందిన 80 సంవత్స రాల వృద్ధుడు గీతకార్మికుడు మిట్టపల్లి రాములు శనివారం రామంతాపూర్ నుంచి టీవీఎస్ మోపెడ్‌పై కుంభమేళాకు బయలు దేరాడు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సర్వబాబు యాదవ్ మల్లికార్జున్‌స్వామి ఆలయం నుంచి జెండా ఊపి అతని యాత్రను ప్రారంభించారు.

## పాఠశాల వార్షికోత్సవం




సైదాబాద్, ఫిబ్రవరి 8 : మలక్ పేట నెహ్రూ మెమోరియల్ ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవాన్ని శనివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలబాలికలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకర్షించాయి. పాఠశాలలో 300 మంది విద్యార్థులకు ప్రతి రోజు ఉదయం అల్పాహారం (బ్రేక్ ఫాస్ట్)ను అందిస్తున్న బాలవీరయ్య కుమారులను వట్టెం మహేశ్, రమేశ్, కరుణలను పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ప్రతినిధులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మహేశ్ కుటుంబ సభ్యులతో పాటు మలక్ పేట ఇనెస్పెక్టర్ నరేశ్, ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొని మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు భోజన వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఆస్తిపన్ను వసూలు చేయండి



అధికారులతో సమావేశంలో మాట్లాడుతున్న డీసీ జగన్

**కాప్రా, ఫిబ్రవరి 8:** కాప్రాసర్కిల్‌లో ఆస్తిపన్ను వసూళ్లను ముమ్మరం చేయాలని సర్కి ల్ డిప్యూటీకమిషనర్ సూచించారు. సర్కిల్ కార్యాలయంలో రెవెన్యూ విభాగానికి చెందిన బిల్‌కలెక్టర్లు, టాక్స్ ఇన్‌స్పెక్టర్లు, వాల్యుయేషన్ అధికారులతో శనివారం జరిగిన సమావేశంలో డీసీ మాట్లాడుతూ 2024-2025 సంవత్సరానికి గాను ఆస్తిపన్ను వసూళ్ల టార్గెట్ రూ.72.43కోట్లను సాధించే దిశగా అధికారులు, సిబ్బంది కృషి చేయాలని సూ చించారు.

## బహిరంగ ప్రకటన

సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయునదేమనగా, నా క్లయింట్ కందుకూరు గ్రామం మరియు మండలం, రంగారెడ్డి జిల్లా వద్ద గల సర్వే నెం.110లో ఎక.7-28 గుంటలు, సర్వే నెం.112లో ఎక.10.20 గుంటలు మరియు సర్వే నెం.113లో ఎక.7-14 గుంటలు విస్తీర్ణం గల ఎక.25-22 గుంటలు మొత్తం విస్తీర్ణపు భూమిని రమిడి అశ్విన్ రెడ్డి తండ్రి మల్లారెడ్డి నుండి కొనుగోలు చేయాలని ఉద్దేశిస్తున్నారు. ఎవరికైనా పైన తెలిపిన సదరు భూమిపై ఏదేని క్లెయింలు, టైటిల్స్, ప్రయోజనం లేదా ప్రతిపాదిత లావాదేవీలకు ఏదేని అభ్యంతరం కలిగి ఉన్నచో వారు ఈ ప్రచురణ తేదీనుండి 7 (ఏడు) రోజులలోగా దిగువ సంతకందారుకు వారి అభ్యంతరాలను పంపవల్సిందిగా సూచించడమైనది, లేనిచో నా క్లయింట్ సదరు ఆస్తిని కొనుగోలు చేయుటకు ముందుకు సాగుతారు మరియు సదరు భూమి యజమానుల నుండి రిజిస్టర్డ్ సేల్ డీడ్(డీడ్స్)ను ఎగ్జిక్యూట్ చేయబడును. ఆతరువాత అందిన అభ్యంతరాలు/ క్లెయింలు చెల్లవు మరియు నా క్లయింట్ వాటికి కట్టుబడి ఉండరు.

హైదరాబాద్
తేదీ: 08.02.2025

(పి.వెంకట్ రెడ్డి) అడ్వకేట్
ఇం.నెం.1-8-678/16,
పద్మ కాలనీ, నల్లకుంట, హైదరాబాద్-44